# తుంగతుర్తి అభివృద్ధి ఘనత ఎమ్మెల్యే కిశోర్‌దే

- కాళేశ్వరం జలాలతో సస్యశ్యామలం
- కాంగ్రెస్ మాయ మాటలు నమ్మి మోసపోవద్దు
- బీఆర్ఎస్ మ్యానిఫెస్టో చూసి ప్రతిపక్షాల గుండెల్లో ఓటమి భయం
- ఎమ్మెల్యే కిశోర్‌ను మూడోసారి ఆశీర్వదించాలి
- అర్వపల్లి ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి


అర్వపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

అర్వపల్లి, అక్టోబర్ 16 : తుంగతుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత గాదరి కిశోర్‌దేనని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఎన్నికల ప్రచారాన్ని అర్వపల్లిలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాదరి కిశోర్, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జా దీపికాయుగేందర్‌రావుతో కలిసి యోగానంద లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో బీఫామ్‌ను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం నుంచి అర్వపల్లి వై జంక్షన్ వరకు కోలాటాలు ఆట పాటలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో తుంగతుర్తి నియోజకవర్గం కక్షలు, రక్తపు మరకలతో రగిలిపోయేదని, ఏ ఊరికి వెళ్లినా సమాధులు, స్థూపాలే దర్శనిచ్చాయన్నారు. కానీ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో రక్తం పారిన నేలలో కాళేశ్వరం జలాలు పారుతూ ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఎక్కడ చూసినా నిండుకుండలా చెరువులు, కుంటలు దర్శనమిస్తున్నాయన్నారు. రైతు బంధు పథకం దేశంలోనే గొప్ప పథకమని అభివర్ణించారు. యువతకు ఉపాధి కల్పించడం కోసం ఇండస్ట్రియల్ పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. 60యేండ్లలో అధికారంలో కాంగ్రెస్ పార్టీ చేయని అభివృద్ధి పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. రూ.6వేల కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత కిశోర్‌దేనని కొనియాడారు. ప్రజల ఆలోచనల విధానాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోని ఎన్నికల్లో గెలుపొంది అధికారంలోకి రాగానే అమలు చేయనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో ప్రతిపక్షాల గుండెల్లో ఓటమి భయం పట్టుకుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి పోటీ చేయడానికి అభ్యర్థులే కరువయ్యారని తెలిపారు. గాదరి కిశోర్ 50వేల మెజార్టీతో గెలుపొందుతారని ధీమా వ్యక్తం చేశారు.

అంతకు ముందు మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేను జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ శాలువా, గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కాసోజు శంకరమ్మ, రైతు బంధు సమితి జిల్లా కో ఆర్డినేటర్ ఎస్‌ఏ రజాక్, తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మినేని ప్రవంతీసతీశ్, ఎంపీపీ మన్నె రేణుకాలక్ష్మీనర్సయ్యయాదవ్, పార్టీ మండలాధ్యక్షుడు గుండగాని సోమేశ్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ చిల్లంచర్ల విద్యాసాగర్, మొరిశెట్టి ఉపేందర్, సర్పంచ్ బైరబోయిన సునీతారామలింగయ్య, ఎంపీటీసీ కనుకు పద్మాశ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

### కిశోర్ హ్యాట్రిక్ విజయం ఖాయం

- ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

ఇది ఎన్నికల ప్రచారంలా లేదని, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ విజయోత్సవ ర్యాలీల ఉందని ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. ఎమ్మెల్యే మంచి జోష్ మీద ఉన్నాడని, హ్యాట్రిక్ విజయం ఖాయమని తెలిపారు.

### భారీ మెజార్టీ ఇవ్వాలి

- ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డి ఆశీర్వాదంతో తనకు మూడోసారి బీఫామ్ లభించిందని, రెండుమార్లు ప్రజలు ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించారని, మూడోసారి ఆశీర్వదించి భారీ మెజార్టీ ఇవ్వాలని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ కోరారు. శక్తి వంచన లేకుండా నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేశానన్నారు. రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. అర్వపల్లి యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆశీస్సులు పొంది తాను గతంలో సైతం ప్రచారాన్ని ప్రారంభించానని, భగవంతుని ఆశీర్వాదం, ప్రజల ఆశీస్సులతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

## జిల్లాలో సెంట్రల్ ఏఎస్ఓల పర్యటన

నల్లగొండ, అక్టోబర్ 16: కేంద్ర సెక్రటేరియట్ సర్వీస్-2022 బ్యాచ్ సహాయ సెక్షన్ అధికారులు ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో ఫౌండేషన్ కోర్సులో శిక్షణలో భాగంగా సోమవార నుంచి ఈ నెల 20వ వరకు ఐదు రోజుల పాటు జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో పర్యటించనున్నట్లు కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. సెంట్రల్ సెక్రటేరియట్‌లో పనిచేస్తున్న 25 మంది జిల్లా పర్యటనలో భాగంగా నల్లగొండకు వచ్చి కలెక్టర్‌ను కలిసి ఆయన వారితో సమావేశమై ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ బృందం సభ్యులు అక్టోబర్ 3 నుంచి డిసెంబర్ 1 వరకు ఫౌండేషన్ కోర్సుల్లో భాగంగా వారు పర్యటించనున్నారని అన్నారు. 2014 జూన్ 2న ఏర్పడ్డ తెలంగాణ నైసర్గిక స్వరూపం, విస్తీర్ణం, జిల్లాలో పండించే పంటలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై వీరు అధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని నల్లగొండ మండలం అన్నెపర్తి, మిర్యాలగూడ మండలం శ్రీనివా సానగర్, దామరచర్ల మండలం వాడపల్లి, చిట్యాల మండలం ఉరుమడ్ల, మునుగోడు మండలం పలివెల గ్రామాల్లో పర్యటిస్తారని అన్నారు. ఆయా గ్రామాల్లో ఐదుగురు చొప్పున పర్యటించి అక్కడ ఆర్థిక, సాంఘిక పరిస్థితులు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న భూమిలేని నిరుపేదలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలు, జీవన విధానం లాంటి అంశాలపై అధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో మేనేజర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## తిప్పర్తిలో చేప పిల్లల పంపిణీ

తిప్పర్తి, అక్టోబర్ 16: మత్స్య శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని చెరువులో సోమవారం చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా చెరువు చైర్మన్ నూకలవెంకన్న మాట్లాడుతూ మత్స్యకార్మికులకు ఉపాధి పొందడానికి ఉచిత చేప పిల్లలను వదలడం సంతోష కరమన్నారు. ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేయడం ద్వారా కార్మికులకు జీవనోపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు రఘురాం, షేక్ అలీ, మత్స్య సొసైటీ సభ్యులు భిక్షం,శివకృష్ణ, బైరు జానయ్య, ఎన్.శ్రీను, చిన్న సైదులు, నరేశ్, సత్యనారాయణ, రామారావు పాల్గొన్నారు.


తిప్పర్తి : చేపపిల్లలను వదులుతున్న మత్స్య శాఖ అధికారులు

## ఎమ్మెల్యే చిరుమర్తి గెలుపునకు మాలలు కృషి చేయాలి

- మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు పరమేశ్

చిట్యాల, అక్టోబర్ 16 : వచ్చే ఎన్నికల్లో నకిరేకల్ ఎమ్మెల్యేగా చిరుమర్తి లింగయ్యను గెలుపునకు నియోజవర్గంలోని మాలలంతా కృషి చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లె పరమేశ్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో జరిగిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో మాలలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు మంత్రి వర్గం, కార్పొరేషన్ పదవుల్లో ప్రాతినిధ్యం కల్పించి న్యాయం చేశారని అందువల్ల ఆయన ప్రతిపాదించిన బీఆర్ఎస్ అభ్యర్థి లింగయ్య గెలుపుకోసం అందరం కలిసికట్టుగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సురేందర్ , బెల్లపు రమేశ్, బెల్లపు జయంత్, గండమల్ల నాగరాజు, శ్రీకాంత్ స్వా పాల్గొన్నారు.

## బూత్ కమిటీల ఏర్పాటు

చిట్యాల, అక్టోబర్ 16 : మండలంలోని సుంకెనపల్లి, గుండ్రాంపల్లిలలో సోమవారం బీఆర్ఎస్ బూత్ కమిటీని ఏర్పాటు చేశారు. సుంకెనపల్లి 60వ బూత్ ఇన్‌చార్జిగా పోలేపల్లి నాగరాజు, 61వ బూత్ ఇన్‌చార్జి కక్కిరేణి భిక్షం, గుండ్రాంపల్లి 62వ బూత్‌కమిటీ ఇన్‌చార్జిగా ఎండీ వాజిద్, 64వ బూత్ ఇన్‌చార్జిగా రత్నం నర్సింహను నియమించారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ ఎసిరెడ్డి దయాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఏ.ఐ లయ్య, కల్లూరి మల్లారెడ్డి, నాయకులు సుంకరి యాదగిరి, కొలను వెంకటేశ్, సర్పంచు కక్కిరేణి బొందయ్య, రత్నం పుష్ప, ఉప సర్పంచ్ బాతరాజు రవీందర్, మోసిన్, రాచకొండ కిష్టయ్య, భీమిడి వెంకట్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కంచర్ల ఆర్థిక సాయం

నల్లగొండ సిటీ, అక్టోబర్ 16: కనగల్ మండల కేంద్రానికి చెందిన మహేశ్వరం ఈశ్వరమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి వారి కుటుంబానికి తక్షణ ఖర్చుల కింద రూ.10 వేలు పంపించారు. నగదును ఎంపీపీ కరీంపాషా, జడ్పీటీసీ వెంకటేశం చిట్ల వెంకటేశం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అయితగోని యాదయ్య, కురంపల్లి సర్పంచ్ తలారి కరుణశ్రీ, బోయినపల్లి సర్పంచ్ యాద య్య, బత్తుల రమేశ్ ఉన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నల్లగొండ సిటీ, అక్టోబర్ 16 : నల్లగొండలో రోడ్డు విస్తరణ పనుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 6.30 నుంచి 12 గంటల వరకు ఓల్డ్‌చౌరస్తా, జమ్మలగూడ, ఖాజాబౌలీ, గిరకబాయిగూడెం, స్టార్ ఫంక్షన్‌హాల్ ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

## నల్లగొండలో ఇరువర్గాల మధ్య ఘర్షణ.. 12 మందిపై కేసు

నల్లగొండ సిటీ, అక్టోబర్ 16: నల్లగొండ పట్టణంలోని ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణ కేసులో 12 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ అపూర్వ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాన్యంచెల్కకు చెందిన షేక్ హసనుద్దీన్ అలియాస్ హస్సు కొన్ని రోజులుగా కన్సల్టెన్సీ నడుపుతున్నట్లు పేర్కొన్నాడు. స్థానికులకు వీసా ఇప్పించి విదేశాలకు పంపుతుంటాడు. ఈ క్రమంలో మాన్యం చెల్కకు చెందిన ముదసిర్ అహ్మద్ అలియాస్ అబ్దుల్లా వద్ద రూ.1.10 లక్షలు తీసుకొని కతార్ పంపడానికి ఒప్పందం చేసుకున్నాడు. అనంతరం వీసా ఏర్పాటు చేశాడు. కరోనా లాక్‌డౌన్ కారణంగా వీసా గడువు ముగిసింది. ముసిదర్ తన డబ్బులు తిరిగి ఇవ్వాలని హసనుద్దీన్‌ను పలుసార్లు అడిగినప్పటికీ డబ్బులు ఇవ్వలేదు. దాంతో అహ్మద్ తన స్నేహితుడు రౌడీ షీటర్ షేక్ చాంద్‌కి విషయం తెలుపడంతో చాంద్ ఆయనతో హసనుద్దీన్ బెదిరించాడు. ఈవిషయంపై మాట్లాడుకుందామని ఇరువర్గాలు లిటిల్ ఫ్లవర్ స్కూల్ సమీపంలో వచ్చారు. మాటమాటా పెరిగి మారణాయుధాలతో దాడులు చేసుకున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

## వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

నేరేడుచర్ల, అక్టోబర్ 16 : స్థానిక వాసవీ, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో సోమవారం ఒకేరోజు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయ నిర్మాణానికి సాయం, సిమెంట్ బల్లాలు, మంచినీటి ట్యాంకు బహూకరణ, నిరుపేద విద్యార్థికి సాయం, మరో నిరుపేద మహిళకు బియ్యం పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని దిర్శించర్ల గ్రామంలోని సాయిబాబా ఆలయంలో పాలరాతి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీ, వనితా క్లబ్ సభ్యులు రాచకొండ విజయలక్ష్మి, కందిబం వాసంతి, కొత్త లక్ష్మణ్, వీరవల్లి శ్రీలత, పోలిశెట్టి సంధ్య, ఈగ భాగ్యలక్ష్మి, అశోక్, అంజయ్య, గోపాలకృష్ణ, హరిబాబు, మధు, అశోక్, రాంప్రసాద్, లక్ష్మీనారాయణ, కళావతి పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు శరత్

యాదగిరిగుట్ట, అక్టోబర్16 : యాదగిరిగుట్ట జడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఆరె యశ్వంత్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శరత్ యామిని తెలిపారు. ఈ నెల 14న సూర్యాపేటలో జరిగిన 67వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్-14 బాలుర విభాగంలో పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. యశ్వంత్‌ను ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్ కుమారస్వామి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

### మోడల్ స్కూల్ విద్యార్థిని శ్రీజ..

బొమ్మలరామారం : మండలంలోని మోడల్ స్కూల్‌లోని జూనియర్ కళాశాలలో చదువుతున్న శ్రీజ ఈ నెల 14న సూర్యాపేటలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ అండర్-17 విభాగంలో ప్రతిభ కనబర్చి ఈ నెల 19 నుంచి మహబూబ్‌నగర్‌లో జరిగే వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శోభారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీజను ఉపాధ్యాయులు అభినందించారు.

## పీహెచ్‌సీ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలి

- భువనగిరి డీఎంహెచ్ఓ పరిపూర్ణాచారి

మోటకొండూర్, అక్టోబర్ 16 : పీహెచ్‌సీ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి పరిపూర్ణాచారి అన్నారు. సోమవారం మోటకొండూరు పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి మోజెస్, సిబ్బంది పాల్గొన్నారు.